క్లుప్తంగా

ఆత్మ విజ్ఞానమే ఓంకార మహాయజ్ఞం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదిక్షపై బుధవారం ఓంకార మహాయజ్ఞంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ప్రణవ ఆశ్రమం(కాకినాడ) వ్యవస్థాపకులు పూజ్యశ్రీ స్వామి సుమిత్రానంద సర్వస్వతీ మాతాజీ ఆధ్వర్యంలో ప్రవచనం నిర్వహించారు. ఆలయ పాలకవర్గం అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమ నిర్వహకురాలు కొమ్మినేని లక్ష్మీఅపర్ణ పాల్గొనగా, మాతాజీని దేవాలయ పాలకవర్గం సత్కరించారు.

మహాకుంభ మేళాకు ప్రత్యేక బస్సు సర్వీసులు

పట్నంబజారు: మహాకుంభ మేళాకు గుంటూరు నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ బుధవారం తెలిపారు. గుంటూరు -2 డిపో నుంచి ఈనెల 11 పుష్‌బ్యాక్ సూపర్ లగ్జరీ బస్సు ఉదయం 10 గంటలకు బయల్దేరుతుందని చెప్పారు. యాత్ర మొత్తం ఎనిమిది రోజులు ఉంటుందన్నారు. బయల్దేరిన రెండో రోజు సాయంత్రానికి కుంభమేళా జరుగు స్థలం ప్రయాగ్‌రాజ్‌కు చేరుతుందన్నారు. అనంతరం పుణ్యస్నానాలు ఆచరించి నాలుగో రోజు రాత్రి అయోధ్య చేసుకుంటారని తెలిపారు. బాలరాముడిని దర్శనం అనంతరం వారణాసి వెళ్లి వారణాసిలో స్వామిని దర్శించుకుని తిరిగి బయల్దేరుతారని వెల్లడించారు. ఎనిమిది రోజుల యాత్రలో భాగంగా ప్రతి మనిషికి టికెట్టు ధర రూ. 8,300 నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేయదలచిన వారు 91927 సర్వీసు నంబరుకు ద్వారా రిజర్వేషన్ చేసుకోవాలని తెలిపారు. భోజనం, వసతి ఖర్చు ఎవరికి వారు భరించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 7382897459, 7382896403 నంబరులో సంప్రదించాలని కోరారు.

వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి!



పట్నం బజారు: వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి చెందిందని బంధువులు ఆందోళనకు దిగిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. వివరాలు.. గుంటూరు తూర్పు పరిధిలోని చిన్నబజారులో నివాసం ఉండే ఆసిఫా అంజున్(3) సంవత్సరాల చిన్నారికి బుధవారం అనారోగ్యానికి గురికావడంతో అదే ప్రాంతంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు సాయంత్రం తీసుకు రావాలని పంపించారు. తల్లిదండ్రులు తిరిగి తీసుకెళుతున్న క్రమంలో చిన్నారి శ్వాసకు సంబంధించి ఇబ్బందికి గురై మృతి చెందింది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు వైద్యుల నిర్లక్ష్యంతోనే పాప మృతి చెందిందని ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగినట్లు సమాచారం. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని లాలాపేట పోలీసులు తెలిపారు.

పోలీస్ జాగిలం రాబర్ట్ మృతి



నగరంపాలెం: వృద్ధాప్యం, అనారోగ్యంతో జిల్లా పోలీస్ విభాగానికి చెందిన జాగిలం రాబర్ట్ (శునకం) బుధవారం మృతి చెందింది. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని జాగిలాల ఖనన కేంద్రంలో పోలీస్ జాగిలం రాబర్ట్‌ను పోలీస్ అధికార లాంఛనాలతో ఖననం చేశారు. జిల్లా పోలీస్ శాఖలో పేలుడు పదార్థాలను గుర్తించే జాగిలంగా సేవలందించగా, వీఐపీల బందోబస్త్ వేళల్లోనూ సమర్థంగా విధులు నిర్వహించినట్లు జిల్లా ఏఎస్పీ ఎ.హనుమంతు(ఏఆర్) అన్నారు. అనుమానాస్పద ఆనవాళ్లను వెంటనే గుర్తించేదని చెప్పారు. జిల్లాకు ప్రముఖ వ్యక్తుల రాకతో వారి భద్రతకై బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ చేపట్టే ముందస్తు భద్రత చర్యల్లో చురుకుగా పాల్గొన్నట్లు తెలిపారు. ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ నివాళులర్పించారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

గుంటూరు మెడికల్: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి నూకల మధుకర్‌జీ పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన పార్టీ జిల్లా కార్యాలయంలో గుంటూరు జిల్లాలో నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులతో జిల్లా పదాధికారుల సమావేశం బుధవారం నిర్వహించారు. నూకల మధుకర్ జీ మాట్లాడుతూ బూత్ కమిటీలతో పాటు, మండల కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి తమనం పూడి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

కీళ్లు బాధిస్తున్నాయి...

- చిన్న వయస్సులోనే సమస్య
- ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న బాధితులు
- ముందస్తు జాగ్రత్తలతో చెక్ పెట్టవచ్చు



గుంటూరు మెడికల్: కీళ్ల నొప్పులు సాధారణంగా వయస్సు పైబడిన వారిలో ఎక్కువగా ఉంటాయి. పంట పొలాల్లో కష్టపడి పనిచేసుకుంటూ వ్యాధులపై ఏ మాత్రం అవగాహన లేని పల్లెటూరిలో ఉండే వారు ఎక్కువగా కీళ్లనొప్పుల గురించి వైద్యుల వద్ద ప్రస్తావిస్తుంటారు. కాని నేడు ఆధునిక జీవనశైలి మారటంతో పల్లె, పట్నం అనే తేడా లేకుండా ప్రతిచోటా కీళ్ల నొప్పుల బాధితులు కనిపిస్తున్నారు. 40 ఏళ్లకే నొప్పుల బారిన పడి వైద్యులను సంప్రదిస్తూ ఉన్నారు. వ్యాధిపై కొద్ది అవగాహన కల్గి ఉండటంతోపాటుగా కొద్దిపాటు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా నొప్పుల బాధల నుండి బయటపడొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

బాధితులు అధికమే...

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రతి ఆరుగురిలో ఒకరు కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. తాగేనీటిలో ఫ్లోరిన్ అధికంగా ఉండటం వల్ల పల్నాడు జిల్లా ప్రజలు ఎక్కువగా ఆర్థరైటిస్ బారిన పడుతున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి ప్రతిరోజూ వివిధ సమస్యలతో 300 మంది వస్తున్నారు. వీరిలో సుమారు 160 మంది వరకు ఆర్థరైటిస్ వ్యాధి బాధితులే. జిల్లాలో 300 మంది ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్దకు వివిధ రకాల ఆర్థోపెడిక్ సమస్యలతో 50 మంది వరకు సంప్రదిస్తున్నారు. ఆడవాళ్ళకు 40 ఏళ్లలోపే కీళ్లనొప్పులు వస్తుండగా మగవారికి 60 ఏళ్లకు వస్తున్నాయి.

వీరిలో కీళ్ల అరుగుదల....

కీళ్ల అరుగుదల అనేది శరీరంలో ఏ భాగంపైనైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ అరుగుదల కారణంగా ప్రధానంగా మోకీలు, తొంటి, నడుము, మెడ దెబ్బతింటాయి. నొప్పుల బాధపడేవారి సంఖ్య రాను రానూ పెరుగుతూ వస్తుంది. పొగ తాగేవారిలో, స్థూలకాయం ఉన్నవారిలో, 55 సంవత్సరాలు పైబడిన వారిలోనూ, గతంలో కీళ్లకు దగ్గరగా ఫ్రాక్చర్ అయిన వారిలో, కీళ్ల వాతంతో బాధపడేవారిలో, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్స్ వల్ల, మహిళల్లో రుతు క్రమం ఆగిపోయినవారిలో కీళ్ల అరుగుదల ఉంటుంది.

అపోహలు వీడాలి...

కీళ్ల నొప్పులు (కీళ్ల అరుగుదల) నివారించలేరనే అపోహ ప్రజల్లో ఉంది. కీళ్లవాతం వల్ల వచ్చే నొప్పులు, కీళ్లవాపుల వల్ల వచ్చే నొప్పులు, కీళ్లలో చీము చేరటం వల్ల వచ్చేనొప్పులు, విరిగిన ఎముకల వల్ల కలిగే నొప్పులకు సరైన సమయంలో వైద్యం చేస్తే నివారించవచ్చు. మోకాలు, తుంటి నొప్పితో బాధపడేవారికి ఆపరేషన్ అవసరమా కాదా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. కీళ్లనొప్పుల్లో స్వల్పం, మధ్యస్థం ఉన్నవారికి ఆపరేషన్ అవసరం లేదు. తీవ్రదశలో ఉన్నవారికి మాత్రమే ఆపరేషన్ అవసరం ఉంటుంది.

పదిశాతం మందికే ఆపరేషన్లు అవసరం...



మోకీలు నొప్పులు అధికంగా ఉంటే తప్పనిసరిగా వైద్యుల పర్యవేక్షణలో అవసరమైన మేరకే మందులువాడాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, ఆహారపు అలవాట్లు, జీవన విధానాన్ని మార్చుకోవటం ద్వారా చాలా వరకు వ్యాధి బారిన పడకుంగా ఉండవచ్చు. బాధితుల కోసం స్టెమ్‌సెల్స్ థెరపీ, ప్లేట్‌లెట్‌రిచ్‌ప్లాస్మా, మొజైక్ ప్లాస్టీ లాంటి ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. మోకీలు పూర్తిగా అరిగి దినచర్య కష్టతరమై, కీళ్లు వంకరపోయిన వారికి మాత్రమే శస్త్రచికిత్స అవసరం.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు.

ఎముకలు బలంగా ఉండాలంటే



ఎముకలు బలంగా ఉండాలంటే ప్రతిరోజూ తప్పనిసరిగా సమీకృత ఆహారం తీసుకోవాలి. గుడ్డు, పాలు, రాగి జావ, పాలకూర ఆహారంతోపాటు ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. ఊబకాయం లేకుండా చూసుకోవాలి. జంక్ ఫుడ్స్, స్మోకింగ్‌కు దూరంగా ఉండాలి. మహిళలు 40 ఏళ్లు దాటితే తప్పనిసరిగా ఎముకల ఆరోగ్యంపై దృష్టి సారించి ప్రత్యేక ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ జి.నరేష్‌బాబు, సీనియర్ స్పయిన్ సర్జన్, గుంటూరు

17న పర్యావరణంపై జాతీయస్థాయి సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 17న పర్యావరణంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు హిందూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం నగరపాలకసంస్థలో కమిషనర్ పులి శ్రీనివాసులు సదస్సు బ్రోచర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం - ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా ఆరోగ్యకరమైన వాతావరణం కోసం సుస్థిర అభివృద్ధికి తీసుకునే చర్యలు అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కళాశాల వృక్షశాస్త్ర విభాగ విశ్రాంత అధిపతి డాక్టర్ టీఎస్ రామారావు స్మారకార్థం నిర్వహిస్తున్న సదస్సులో భాగంగా ఓరల్ ప్రజెంటేషన్, డిజిటల్ పోస్టర్ ప్రజెంటేషన్‌లో విజేతలకు నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 10లోపు 9491 663068, 79810 58549 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పర్యావరణ విద్య డైరెక్టర్ డి.తిరుపతి రెడ్డి, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు అధికారి కె.నారాయణ, అధ్యాపకులు జి.సుబ్రహ్మణ్యం, డాక్టర్ జి.రమేష్, డాక్టర్ ఎన్.కృష్ణ పాల్గొన్నారు.

నేడు జేకేసీ కళాశాలలో వర్క్‌షాప్

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రసాయన శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో స్థిరమైన అభివృద్ధి కోసం గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి- వినియోగంపై గురువారం అంతర్జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ తెలిపారు. బుధవారం జేకేసీ నగర్‌లోని కళాశాలలో వర్క్‌షాప్ బ్రోచర్ విడుదల చేశారు. ఈసందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బొగ్గు, డీజిల్, భారీ ఇంధన చమురుతో పోల్చితే గ్రీన్ హైడ్రోజన్ క్లీన్ ఎనర్జీగా ఉపయోగపడుతోందని అన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ప్రాముఖ్యతను చాటుతూ, ఈ రంగంలో పరిశోధనల దిశగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు హాంకాంగ్ పాలిటెక్నిక్ యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ బి.గోరవర్ధన్‌బాబు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ బి.జయదేవ్ కౌశిక్ వర్క్‌షాప్‌లో వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన

గుంటూరు మెడికల్: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా కేఎల్ యూనివర్సిటీలో బుధవారం విద్యార్థినులకు సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయవాడ అబ్ స్టేట్రి షియన్ అండ్ గైనకాలజిస్ట్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ శ్రీదేవి వెల్లంకి సర్వైకల్ క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హోప్ విన్ హాస్పిటల్స్ చైర్‌పర్సన్, ప్రముఖ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ హెచ్‌పీవీ వ్యాక్సిన్ వలన కలిగే లాభాలను వివరించారు. హోప్ విన్ హాస్పిటల్, సంస్థ సలాం నమస్తే గుంటూరు సొసైటీ చేపట్టిన 'ప్రాజెక్ట్ సర్విక' విజయవంతంగా పూర్తి చేసినందుకు డాక్టర్ షమా సుల్తానా ను అభినందించారు. కార్యక్రమంలో జేఎఫ్ డి.రాజేందర్ రెడ్డి కందుల, జె.ఎఫ్ఎం ప్రదీప్ కొడాలి, జే ఎఫ్ఎం ట్రెజరర్ డివి ప్రసాద్, ప్రాజెక్ట్ డైరెక్టర్ సుమ అట్లూరి, ప్రాజెక్ట్ కో-డైరెక్టర్ సుభాష షేక్, వైస్ ప్రెసిడెంట్ గిరిధర్, లేడీ జేసీ రిప్రజెంటేటివ్ దీపిక కొడాలి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ షమా సుల్తానా, డాక్టర్ శ్రీదేవి వెల్లంకి


న్యాయవాది వృత్తిలో మరింతగా రాణించాలి



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

నగరంపాలెం: న్యాయవాది వృత్తిలో రాణించేందుకు మరింతగా శ్రమించాలని గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అన్నారు. ఏసీ లా కళాశాలలో చివరి సంవత్సరం అభ్యసించే విద్యార్థులకు ఐదు రోజుల శిక్షణ తరగతులు బుధవారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో ప్రారంభమయ్యాయి. నైపుణ్యవంతమైన న్యాయవాదులుగా రాణించేందుకు మెలకువలు, పాటించాల్సిన అంశాలపై వక్తలు ప్రసంగించారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ అన్ని అంశాల్లో నూ పట్టు సాధించాలని చెప్పారు. పోటీ పరీక్షలకు హా జరవ్వాలని, ఎప్పటికప్పుడు జనరల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని అన్నారు. ఆంగ్లంపై అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లెక్చరర్ సయ్యద్‌బాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలు సామాజిక బాధ్యతతో పనిచేయాలి



విద్యార్థులతో డీఈఓ రేణుక

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సంఘాలు హక్కుల సాధన కోసం ఉద్యమాలకే పరిమితం కాకుండా విద్యార్థుల అభ్యున్నతి కోసం సామాజిక బాధ్యతతో వ్యవహరించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అన్నారు. బుధవారం కొత్తపేటలోని జలగం రామారావు స్మారక నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ నగరశాఖ ఆధ్వర్యంలో శ్రీతులసి ఎడ్యుకేషనల్ గైడెన్స్ ట్రస్ట్ సహకారంతో 500 మంది టెన్త్ విద్యార్థులకు ఎస్టీయూ నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్, ప్యాడ్లు, పెన్నులతో పాటు పోషకాహార కిట్స్ పంపిణీ చేశారు. తులసి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఎండీ కె. మురళీకృష్ణ, ఏపీఎస్టీఎఫ్ కోశాధికారి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి. పెదబాబు, కొరివి విజయబాబు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, ఎస్టీయూ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకయ్య, ఉగ్గం మహంకాళరావు, వై. శ్యాంబాబు, జయ సుందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు మూడు నామినేషన్లు

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి బుధవారం ముగ్గురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పాపురి వెంకట అశోక్, ఎంఢ్రెడ్డి శివా రెడ్డి, రాంబాబు గుడిస ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్లను రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మికి అందజేశారు.

పట్టాభిషేక మహోత్సవానికి తరలిరావాలి

నగరంపాలెం: పెనుగొండలో ఈనెల 8న అఖిల భారత శ్రీవాసవి పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ పెనుగొండ క్షేత్ర పీఠాధిపతిగా శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) పీఠాధిరోహణ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట రాజేంద్రప్రసాద్ తెలిపారు. జిన్నాటవర కూడలిలోని చాంబర్ ఆఫ్ కామర్స్ బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఆర్యవైశ్యులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, నాయకులు ఇమ్మడి శెట్టి సత్యనారాయణ, సురేష్‌కుమార్, అన్నా పూర్ణ చంద్రరావు, టీఎల్‌వీ వీరాంజనేయులు పాల్గొన్నారు.


ఉచిత పథకాలపై చర్చ

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఉచిత పథకాలపై చర్చ నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విద్యావేత్త ఇ.చంద్రయ్య, విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడారు.

మహిళ చేతిలో హ్యాండ్ బ్యాగ్ చోరీ

లక్ష్మీపురం: గుజ్జనగుండ్ల డీమార్ట్‌లో కుటుంబ సభ్యులతో వచ్చి సరుకులు కొనుగోలు చేసుకుని బయటకు వస్తున్న ఓ మహిళ చేతిలో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి బ్యాగ్ లాక్కొని పరారైన ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. చుట్టుగుంట, శ్రీరామ్ నగర్ ప్రాంతానికి చెందిన ముత్యాల లక్ష్మి, ఆమె కోడలు, కుటుంబ సభ్యులతో కలిసి గుజ్జనగుండ్ల వద్ద గల డీ మార్ట్‌కు వచ్చారు. డీ మార్ట్‌లో సరుకులు కొనుగోలు చేసి బయటకు వచ్చి కోడలు, కుటుంబ సభ్యులు సరుకులను ఆటోలో ఎక్కిస్తున్నారు. ముత్యాల లక్ష్మి చేతిలో హ్యాండ్ బ్యాగ్‌తో లాక్కొని పరారైయ్యారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం ఎస్ఐ నరహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గణపతి స్వామి కళ్యాణ మహోత్సవం



నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎన్ కాలనీ శ్రీపద్మావతి గోదాస మేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవిజయ గణపతి స్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజుకి చేరాయి. బుధవారం ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, వాస్తు పూజ, వాస్తు హోమం, అగ్ని ప్రణయనం, విశేష హోమం, బలిహరణ కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేళలో నవగ్రహ స్థాపన, అర్చన, నిత్య హోమం చేపట్టారు. అనంతరం శ్రీసిద్ధి బుద్ధి సమేత శ్రీ విజయ గణపతి స్వామి వారి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు వట్టికూటి పూర్ణచంద్రరావు దంపతులు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

అనధికార వ్యర్థాల సేకరణ నిలిపివేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో కమర్షియల్ సంస్థలు, చికెన్ స్టాల్స్ నుంచి అనధికార వ్యర్థాల సేకరణ తక్షణం నిలిపివేయాలని, ప్రతి కమర్షియల్ సంస్థ డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని లేకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ చేపట్టనున్న పలు చర్యలపై నగరపాలక సంస్థ ప్రధాన కార్యాల యం కౌన్సిల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కమర్షియల్ సంస్థల నుంచి వ్యర్థాల సేకరణకు గతంలో రెండు సంస్థలకు కాంట్రాక్ట్ ఇవ్వడం జరిగిందని, ఇప్పటికే ఆయా సంస్థల కాంట్రాక్ట్ గడువు ముగిసిందన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉందని, కోడ్ అనంతరం నూతన టెండర్ పిలుస్తామన్నారు. శంకర్ విలాస్, ఇన్నర్ రింగ్ రోడ్ గడ్డిపాడు రైల్వే గేటు వద్ద మంజూరైన ఆర్‌ఓబీ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని, సంజీవయ్య నగర్, శ్యామలా నగర్ దగ్గర కూడా ఆర్‌ఓబీలు మంజూరు అయ్యే అవకాశం ఉన్నందున నగరంలో ప్రజల రాకపోకలకు వీలుగా రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు.

డ్రెయిన్ టూ డ్రెయిన్ ఉండాలి..

గుంటూరు నగరంలో అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టే రోడ్లు డ్రెయిన్ టూ డ్రెయిన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ ఏటీ అగ్రహారం, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఇస్కాన్ గుడి రోడ్, పట్టాభిపురం, గోరంట్ల, ఇజ్రాయిల్ పేట, సుద్దపల్లి డొంక తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను, తనిఖీ చేసి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈ మధుసూదన్, ఏసీపీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పన్ను వసూలు వేగవంతం చేయాలి

రాష్ట్రంలోనే గుంటూరు నగర పాలక సంస్థ రెవెన్యూ వసూలులో వెనుకబడి ఉందని, వేగవంతం చేయాలని, పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహించే కార్యదర్శులు, ఆర్ఐలపై చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగం అధికారులతో ఆస్తి పన్ను వసూలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత సచివాలయాల వారీగా ఉన్న డిమాండ్, వసూళ్ళ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, సి.హెచ్. శ్రీనివాసరావు, సెక్రటరీ పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్పొరేట్ల అభ్యున్నతే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



లాడ్జి సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ చూస్తుంటే పక్కాగా కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని స్పష్టమవుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అన్నారు. కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా స్థానిక లాడ్జి సెంటర్ లోనే అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయనతో పాటు సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కూరపాటి కోటయ్య, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకురాదలిచిన 4 లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ కాకుండా పరిరక్షించాలని, దేశ వ్యాప్తంగా ప్రభుత్వ సంస్థల్లో ఉన్నటువంటి ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పుప్పాల సత్యనారాయణ, కోట మాల్యాద్రి, జి.సురేష్‌బాబు, కె.రాంప్రసాద్, సీఐటీయూ నాయకులు శ్రీనివాసరావు, మస్తాన్ వలి, సలీం, రవి, రైతు సంఘం నాయకులు జగన్నాథం, జంగాల చైతన్య, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి



అవగాకల్పిస్తున్న ఒమెగా హాస్పిటల్ వైద్య బృందం

గుంటూరు మెడికల్: గుంటూరులోని ఒమెగా హాస్పిటల్ ఆధ్వర్యంలో సమగ్ర అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ సమగ్ర క్యాన్సర్ కేంద్రమైన ఒమేగా హాస్పిటల్, ''యునైటెడ్ బై యునిక్' పేరుతో 2025 ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించింది. క్యాన్సర్‌పై అవగాహన, ముందస్తు గుర్తింపు, రోగి మద్దతు లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మహిళల క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒమేగా హాస్పిటల్ డైరెక్టర్, చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎం.జి.నాగకిషోర్ మాట్లాడుతూ 2017 ఫిబ్రవరి 3న కార్యకలాపాలను ప్రారంభించినట్లు చెప్పారు. గత ఏడు సంవత్సరాల్లో లక్ష మందికి పైగా రోగులకు విజయవంతంగా చికిత్స అందించినట్లు వివరించారు. ప్రత్యేక వైద్య, శస్త్రచికిత్స, రేడియేషన్ ఆంకాలజీ సేవలు సహా సమగ్రమైన క్యాన్సర్ కేర్‌ను తమ ఆస్పత్రిలో అందిస్తున్నామని చెప్పారు. మహిళా ఆంకాలజిస్టుల ప్రత్యేక బృందం తమ ఆస్పత్రిలో ఉన్నట్లు వెల్లడించారు. గుంటూరు, విజయవాడ నగరాల్లో మొబైల్ బస్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించడం జరిగిందన్నారు. మామోగ్రఫీ, పాప్ స్మియర్ సహా పలు పరీక్షలతో పాటుగా ఆంకాలజిస్ట్ కన్సల్టేషన్‌తో సహా రూ. 999 ధరకు మహిళల కోసం ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీ కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో మల్టీ-డిసిప్లినరీ ట్యూమర్ బోర్డులను ప్రవేశపెట్టడంలో మొదటి హాస్పిటల్‌గా కూడా ఒమేగా ఖ్యాతి గడించింది. కార్యక్రమాలను సిహెచ్.హేమకుమార్, ఒమేగా హాస్పిటల్ సెంటర్ హెడ్ మహేంద్ర పాలా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

8న ఏపీటీఫ్ జిల్లా విద్యా సదస్సు



విద్యా సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యమ రథసారథి నూతలపాటి పరమేశ్వరావు తృతీయ వర్ధంతి సందర్భంగా ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న పొన్నూరులోని మొవ్వా గార్డెన్స్‌లో జిల్లా స్థాయి విద్యా సదస్సు నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మొహమ్మద్ ఖలీద్ తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో విద్యా సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా బసవలింగారావు మాట్లాడుతూ మాట్లాడుతూ పాఠశాల విద్యారంగంలో వస్తున్న నూతన సంస్కరణలు సవాళ్లు- మన కర్తవ్యాలు అనే అంశంపై సదస్సు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.పార్వతి, పి.లక్ష్మీనారాయణ, జిల్లా శాఖ కార్యదర్శులు ఎస్ఎస్ఎం మూర్తి, జి.దాస్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వి.కిషోర్ షా, జిల్లా కౌన్సిలర్లు పి.శివరామకృష్ణ, టి.భాస్కర్, శరత్ బాబు, బాలకృష్ణ, వరకుమార్, నరసింహారావు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు మెడికల్: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఐక్య వేదిక జిల్లా చైర్మన్ చాంద్ బాషా పేర్కొన్నారు. గుంటూరు జిల్లా సంఘం కార్యాలయంలో బుధ వారం చాంద్ బాషా మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్నా ఉద్యోగుల సమస్యలపై మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల బకాయిలపై షె డ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మరికొన్ని రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న సందర్భంగా ఉద్యోగుల సమస్యలను, ఉద్యోగులకు రావలసిన బకాయిల పైన ప్రభుత్వం స్పందించాలన్నారు. ఫిబ్రవరి 6న జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లాషా ఖాదరి, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, నాగభూషణం, శ్రీనివాస్, పెద రత్తయ్య, లక్ష్మీనారాయణ, ప్రసాద్, వేంకటేశ్వర రెడ్డి, జాన్ పాల్గొన్నారు.